క్లుప్తంగా

క్రాస్ ప్రోగ్రాం ప్రారంభం



పచ్చజెండా ఊపి, క్రాస్ ప్రోగ్రాం వాహనాన్ని ప్రారంభిస్తున్న ఎంపీపీ లక్ష్మి

బొబ్బిలి: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో క్రాస్ ప్రోగ్రాంను జెడ్పీటీసీ సంకిలి శాంతకుమారితో కలిసి ఎంపీపీ శంబంగి లక్ష్మి శుక్రవారం ప్రారంభించారు. వేసవి నేపథ్యంలో ఎక్కడా తాగునీటి ఇక్కట్లు లేకుండా చేసేందుకు ఈ కార్యక్రమం ప్రారంభించినట్లు ఎంపీపీ తెలిపారు. గ్రామ గ్రామానికి క్రాస్ ప్రోగ్రాం వాహనం ద్వారా సిబ్బంది వెళ్లి, అక్కడ మరమ్మతులకు గురైన తాగునీటి బోర్లను బాగు చేసి, వినియోగంలోకి తీసుకువస్తారన్నారు. ఎంపీడీఓ ఎ.భాస్కరరావు, పార్టీ మండల అధ్యక్షుడు ఎస్.వేణుగోపాలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

23న గురుకులాల ప్రవేశ పరీక్ష

వంగర: మండల పరిధిలోని మడ్డువలసలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల, కళాశాలలో ఐదో తరగతి, ఇంటర్మీడియట్ ఫస్టియర్‌లో ప్రవేశాలకు ఈ నెల 23వ తేదిన పరీక్ష నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ పట్టా పద్మావతి ఓ ప్రకటనలో శుక్రవారం తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఐదో తరగతి అభ్యర్థులకు, మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు ఇంటర్మీడియట్ అభ్యర్థులకు పరీక్ష ఉంటుందని తెలిపారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన

బాడంగి: మండలంలోని ముగడ, గొల్లాది, తెంటువలస, లక్ష్మీపురం, బాడంగి ఆర్‌బీకే పరిధిలో ప్రకృతి వ్యవసాయంపై శుక్రవారం అవగాహన కల్పించారు. ప్రకృతి వ్యవసాయ యూనిట్ ఇన్‌చార్జ్‌లు సూర్యలక్ష్మి, ఈశ్వరరావు మాట్లాడుతూ ప్రతీ రైతు ప్రకృతి వ్యవసాయానికి మొగ్గు చూపాలని, ఈ వ్యవసాయం ద్వారా ఆరోగ్యవంతమైన పంటతో అధిక దిగుబడులు వస్తాయన్నారు. అలాగే పంట పెట్టుబడి ఖర్చు కూడా తగ్గుతుందన్నారు.

ఘనంగా ధరిత్రీ దినోత్సవం

రాజాం సిటీ: స్థానిక సన్ స్కూల్‌లో ప్రపంచ ధరిత్రీ దినోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించా రు. వికాస తరంగిణి సెంట్రల్ ఆర్గనైజింగ్ సెక్రటరీ టీటీవీ రమణమూర్తి మాట్లాడుతూ సకల జీవరాశులకు ఆధారమైన భూమిని కాలుష్య కోరల నుంచి కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ప్రతిఒక్కరూ ఖాళీ ప్రదేశాల్లో మొక్కలు నాటి, పర్యావరణ పరిరక్షణకు తోడ్పడాలని కోరారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వై.భారతి పాల్గొన్నారు.

పన్ను రాయితీని సద్వినియోగం చేసుకోండి

రాజాం సిటీ: మున్సిపాలిటీలోని 2023–24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి, కల్పిస్తున్న పన్ను రాయితీని సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ కార్యాలయ మేనేజర్ ఎంవీ నాగరాజు కోరారు. శుక్రవారం పట్టణంలోని పలు సంస్థలు ముందస్తుగానే పన్ను చెల్లింపు చేయడంతో వారికి రశీదులు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం కల్పిస్తున్న 5 శాతం రాయితీని సద్వినియోగం చేసుకుని, పన్ను చెల్లించేందుకు ముందుకు రావాలన్నారు. ఈ అవకాశం ఈ నెలాఖరు వరకు ఉంటుందన్నారు. కార్యక్రమంలో రెవెన్యూ ఇనెస్పెక్టర్ చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

నియామకపత్రాలు అందజేత

బాడంగి: మండలంలోని పలు గ్రామాల్లో వలంటీర్లుగా ఎంపికైన వారికి జెడ్పీటీసీ పెద్దింటి రామారావు చేతులమీదుగా శుక్రవారం నియామకపత్రాలు అందజేశారు. అనంతరం చిత్తశుద్ధి, నిబద్ధతతో పనిచేసి, ప్రభుత్వానికి మంచిపేరు తీసుకురావాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ఎంపీడీఓ అక్కారావు తదితరులు పాల్గొన్నారు.

వంగర: మండలంలోని మగ్గూరు, శివ్వాం గ్రామాల్లో వలంటీర్లుగా ఎంపికైన వారికి ఎంపీపీ ఉత్తరావెల్లి సురేష్‌ముఖర్జీ శుక్రవారం నియామకపత్రాలు అందజేశారు. సేవాభావంతో పనిచేసి, అర్హులకే సంక్షేమ పథకాలు అందేలా చూడాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీనివాసరావు, సర్పంచ్‌లు రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణల పరిశీలన



రామభద్రపురంలో ఆక్రమణకు గురైన ఆర్ అండ్ బీ స్థలాన్ని పరిశీలిస్తున్న సీపీఐ, సీపీఎం నాయకులు

రామభద్రపురం: మండల కేంద్రంలో ఆక్రమణకు గురైన ఆర్ అండ్ బీ స్థలాన్ని సీపీఎం, సీపీఐ నాయకులు అలమండ ఆనందరావు, బలస శ్రీనివాసరావు శుక్రవారం పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ శివాలయం పక్కనే ఉన్న ఆర్ అండ్ బీ స్థలాన్ని సాలూరుకు చెందిన ఓ రియల్ ఎస్టేట్ వ్యాపారి ఆక్రమిచుకుని, ఇంటి ప్లాట్‌లుగా మలిచి విక్రయాలకు సిద్ధమవుతున్నారని ఆరోపించారు. కొన్ని రూ.కోట్ల విలువైన ప్రభుత్వ భూమి ఆక్రమణకు గురవుతున్నా అధికారుల చర్యలు కనిపించకపోవడం దారుణమన్నారు. ఇదే విషయమై ఆర్ అండ్‌బీ ఈఈ నాగమోహన్‌ను సాక్షి విలేకరులు వివరణ అడగ్గా తానే స్వయంగా వెళ్లి, ఆక్రమణకు గురైన స్థలాన్ని పరిశీలిస్తామన్నారు. రెవెన్యూ కార్యాలయంలోని ఎఫ్‌ఎంబీ ఉందని, అక్కడి స్థల వివరాలు తీసుకుని రెవెన్యూ, పోలీస్ అధికారుల సహాయంతో సర్వే చేయించి, ఆక్రమణలు తొలగించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయం

జగనన్నే మా భవిష్యత్–మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమానికి అన్నిచోట్ల అపూర్వ ఆదరణ లభిస్తోంది. ఎక్కడికి వెళ్లినా జై.. వైఎస్సార్ సీపీ.. జయహో.. జగన్ నినాదాలతో పార్టీ శ్రేణులకు ప్రజలు సాదర స్వాగతం పలుకుతున్నారు. బొబ్బిలి, రాజాం నియోజవర్గాల్లో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో పార్టీ నేతలు, కార్యకర్తలు, అభిమానులు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్లంతా ఇంటింటికీ వెళ్లి, నాలుగేళ్లుగా ప్రభుత్వం ప్రజలకు చేస్తున్న మంచిని వివరించారు. గతంలోని టీడీపీ, ఇప్పటి వైఎస్సార్ సీపీ పాలనకున్న స్పష్టమైన తేడాను గమనించాలని, రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధి, ప్రజాసంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్న జగనన్న సర్కారును వచ్చే ఎన్నికల్లోనూ ఆశీర్వదించి, అధికారంలోకి తీసుకురావాలని కోరారు. – సాక్షి నెట్‌వర్క్



రాజాం సిటీ: మారుతీనగర్‌లో ఇంటింటికీ వెళ్లి, ప్రభుత్వం చేస్తున్న మంచిని వివరిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకుడు లక్ష్మణరావు



రేగిడి: సంకిలిలో ఎంపీటీసీ శ్రీనివాసరావు, సర్పంచ్ పట్టాభి ప్రచారం



వంగర: కొట్టిశలో ఓ ఇంటికి మా నమ్మకం నువ్వే జగన్ స్టిక్కర్ అతికిస్తున్న ఎంపీపీ సురేష్ ముఖర్జీ



రాజాం పట్టణంలోని అమ్మవారి కాలనీలో ఓ ఇంటికి జగనన్నే మా భవిష్యత్–మా నమ్మకం నువ్వే జగన్ స్టిక్కర్ అతికిస్తున్న పార్టీ రాజాం టౌన్ కన్వీనర్ శ్రీనివాసరావు



సంతకవిటి: గుజన్నపేటలో ఇంటింటికీ వెళ్లి, పథకాలు వివరిస్తున్న సర్పంచ్ మోహన్‌రావు



రామభద్రపురం: కొట్టక్కిలో ప్రచారం చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు



తెర్లాం: కుమ్మరిపేటలో సచివాలయ కన్వీనర్లు, గృహసారథుల ప్రచారం

బాలల హక్కుల పరిరక్షణకు కృషి చేయాలి

- ఎంపీపీ నర్సుపల్లి ఉమాలక్ష్మి



మాట్లాడుతున్న ఎంపీపీ ఉమాలక్ష్మి

తెర్లాం: బాలల హక్కుల పరిరక్షణకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని ఎంపీపీ నర్సుపల్లి ఉమాలక్ష్మి కోరారు. ఏపీ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిటీ చైర్మన్ కేసలి అప్పారావు ఆదేశాల మేరకు స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఐసీడీఎస్ బాడంగి పీఓ కె.రాజ్యలక్ష్మి ఆధ్వర్యంలో బాలల హక్కుల పరిరక్షణ మండల స్థాయి సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాలల హక్కులను పరిరక్షించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఎంతగానో కృషి చేస్తోందన్నారు. బాల్యవివాహాల రహిత మండలంగా తెర్లాంను తీర్చిదిద్దేందుకు ఐసీడీఎస్‌తో పాటు అన్ని శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రజలు సహకరించాలన్నారు. ప్రధానంగా గ్రామీణ ప్రాంతాల్లో బాల్యవివాహాల నిర్మూలనకు అంగన్‌వాడీ కార్యకర్తలు, మహిళా పోలీసులు, వైద్య సిబ్బంది గ్రామస్తులకు అవగాహన కల్పించాలన్నారు. ఎంపీడీఓ శంబంగి రామకృష్ణ మాట్లాడుతూ బాలల హక్కులను కాపాడాల్సిన బాధ్యత అన్ని శాఖల అధికారులతో పాటు తల్లిదండ్రులపై ఉందన్నారు. పిల్లలకు మొదటి నుంచి మానవతా విలువలను నేర్పించాలన్నారు. పిల్లలు చెడువ్యసనాలకు బానిస కాకుండా మంచి మార్గంలో నడిచేలా తల్లిదండ్రులు వారిని పెంచాలన్నారు. ఎంఈఓ త్రినాధరావు మాట్లాడుతూ బాలలహక్కులకు, వికాసానికి, స్వేచ్ఛకు ఎటువంటి భంగం కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. సమావేశంలో వైస్ ఎంపీపీ సీహెచ్ సత్యనారాయణ, జెడ్పీటీసీ ప్రతినిధి జి.రామారావు, ఐసీడీఎస్ తెర్లాం, పెరుమాళి, లోచర్ల సెక్టార్ల సూపర్‌వైజర్లు ఉషారాణి, చిట్టెమ్మ తదితరులు పాల్గొన్నారు.

సంతకవిటి ఎస్‌ఐగా లోకేశ్వరరావు



సంతకవిటి: పోలీస్‌స్టేషన్ ఎస్ఐగా బుడుమూరు లోకేశ్వరరావు నియమితులయ్యారు. గతంలో ఇక్కడ ఎస్‌ఐగా పనిచేసిన ఆర్.జనార్దనరావు వంగర స్టేషన్‌కు బదిలీ అయ్యారు.

పక్కాగా ఆడిట్

రాజాం సిటీ: స్థానిక మున్సిపాలిటీలో 2022–23 ఏడాదికి సంబంధించి, ఆదాయ, వ్యయాలపై ఆడిట్ పక్కాగా జరుగుతోందని మున్సిపల్ కమిషనర్ డీటీవీ కృష్ణారావు తెలిపారు. శుక్రవారం జిల్లా ఆడిటర్ అరుణకుమారి మున్సిపాలిటీకి సంబంధించిన అన్ని రకాల ఫైళ్లను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. మున్సిపాలిటీలోని అన్ని శాఖలలో ఏడాది మొత్తం వచ్చిన ఆదాయం, ఖర్చులపై పూర్తి స్థాయిలో సిబ్బంది తనిఖీలు చేస్తున్నారన్నారు. ఆడిట్ అనంతరం జిల్లా ఉన్నతాధికారులకు నివేదిక అందజేస్తామన్నారు. కార్యక్రమంలో మేనేజర్ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

వైద్య శిబిరం ప్రారంభించిన ఎమ్మెల్యే



రాజాం బస్టాండ్ వద్ద వైద్యశిబిరం ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జోగులు

రాజాం: స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద రాజాం మున్సిపల్ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ఎమ్మెల్యే కంబాల జోగులు శుక్రవారం ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ వేసవి ఎండల కారణంగా ఎవరు అస్వస్థతకు గురైనా, వెంటనే శిబిరానికి చేరుకుని, చికిత్స పొంద వచ్చన్నారు. పట్టణంలో జనసంచారం ఎక్కువగా ఉండే మరికొన్ని ప్రదేశాల్లో ఈ తరహా వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి, ప్రజలకు ప్రాథమిక చికిత్స అందజేయనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ డీటీవీ కృష్ణారావు, మేనేజర్ నాగరాజు, పార్టీ రాజాం టౌన్ కన్వీనర్ పి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

సీఎం జగన్‌తోనే సుపరిపాలన

- 'గడప గడపకు మన ప్రభుత్వం'లో ఎమ్మెల్యే శంబంగి వెంకటచిన అప్పలనాయుడు



మహిళలకు సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే శంబంగి

బొబ్బిలి: రాష్ట్రంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే సుపరిపాలన సాధ్యమని ఎమ్మెల్యే శంబంగి వెంకటచిన అప్పలనాయుడు అన్నారు. శుక్రవారం మండలంలోని రాజుపేటలో నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న ఆయనకు గ్రామస్తులు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఇంటింటికీ వెళ్లిన ఆయన నాలుగేళ్లుగా ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పనులు, అమలు చేస్తున్న పథకాలను వివరించారు. ఏవైనా సమస్యలున్నా, అర్హులై ఉండి ఎవరికైనా పథకాలు అందకపోయినా వెంటనే తెలియజేయాలన్నారు. ఈ క్రమంలో పలువురు ఆయన దృష్టికి వచ్చిన చిన్న చిన్న సమస్యలను పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. రాష్ట్రంలో అమలైనన్నీ పథకాలు మరే రాష్ట్రంలో లేవన్నారు. ఇంటికో పథకం అందుతూనే ఉందన్నారు. దీంతో ప్రతీ ఇంట సంక్షేమ కాంతులు వెల్లివిరుస్తున్నాయన్నారు. ప్రభుత్వం చేస్తున్న మంచిని చూసి ఓర్వలేని ప్రతిపక్షాలు, ఎల్లోమీడియా లేనిపోని విమర్శలు చేస్తున్నాయని, అయితే వాటిని ప్రజలు నమ్మడం లేదన్నారు. వచ్చే ఎన్నికల్లోనూ ఇదే ప్రభుత్వాన్ని ఆశీర్వదించి, సీఎం జగనన్‌ను మళ్లీ ముఖ్యమంత్రిని చేయాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు ఎస్.వేణుగోపాలనాయుడు, ఎంపీపీ ఎస్.లక్ష్మి, ఎంపీడీఓ ఎ.భాస్కరరావు, జెడ్పీటీసీ ఎస్.శాంతకుమారి, ఎంపీటీసీ ఎం.సీతారాం, సర్పంచ్ సీహెచ్ రామారావు తదితరులు పాల్గొన్నారు.

వడదెబ్బ బారినపడకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

వంగర: ఉపాధి హామీ పథకం వేతనదారులు వడదెబ్బ బారినపడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఎంపీడీఓ వావిలపల్లి శ్రీనివాసరావు సూచించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఉపాధి హామీ పథకం సిబ్బందితో శుక్రవారం సమావేశమైన ఆయన వేసవి నేపథ్యంలో పని ప్రదేశంలో టెంట్లు, తాగునీరు ఉండేలా చూసుకోవాలన్నారు. అలాగే నిర్దేశిత కొలతల్లో పనిచేయించి, రోజుకు రూ.272 వేతనం అందేలా చూడాలని తెలిపారు. సమావేశంలో ఏపీఓ ఎస్.సంగంనాయుడు, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

గీతాసారమే ముక్తికి మార్గం

- గీతాసారాంశ ప్రవచన కార్యక్రమంలో నైమిశారణ్య పీఠాధిపతి బాలబ్రహ్మానంద సరస్వతి

రాజాం: గీతాసారం ముక్తికి మార్గమని నైమిశారణ్య పీఠాధిపతి బాలబ్రహ్మానంద సరస్వతి అన్నారు. శుక్రవారం పట్టణ పరిధిలోని పోలిపల్లి పైడితల్లి అమ్మవారి ఆలయం వద్ద భక్తులకు దేవీ భాగవత సారాంశంపై ప్రవచనాలు ఉపదేశించారు. హిందూ ధార్మిక ధర్మపథం కార్యక్రమంలో భాగంగా ఇక్కడికి వచ్చిన ఆయనకు తొలుత ఆలయ అర్చకులు వేమకోటి సూర్యనారాయణ శర్మ, ఆలయ ఈఓ బీవీ మాధవరావులతో పాటు అమ్మవారి కాలనీకి చెందిన వెంపల లక్ష్మణరావు, పెంకి చైతన్యకుమార్ తదితరులు ఘనస్వాగతం పలికారు. పైడితల్లికి పూజలు చేసిన అనంతరం ఆధ్యాత్మిక ప్రసంగం ఆరంభించిన ఆయన పాప–పుణ్యాలు, వాటి ఫలితాలను వివరించారు. పాప, పుణ్యాల ఫలితమే కర్మలని, వాటి ద్వారానే ఫలితాలు కూడా ఉంటాయన్నారు. సుఖ,దుఃఖాలకు కారణం మన నడవడికలేనన్నారు. భగవద్గీతలో శ్రీకృష్ణుడు అర్జునుడికి ఈ కర్మల గురించే ఉపదేశించాడని పేర్కొన్నారు. అర్జునుడు వాటిని అర్థం చేసుకునే యుద్ధంలో విజేతగా నిలిచాడన్నారు.

కేంద్ర ప్రభుత్వ విధానాలను తిప్పికొట్టాలి

- కేంద్రానికి వ్యతిరేకంగా సీపీఐ, సీపీఎం ప్రచారం



రాజాం సిటీ: అంబేడ్కర్ జంక్షన్ వద్ద కేంద్ర ప్రభుత్వ విధానాలను నిరసిస్తూ ప్రచారం చేస్తున్న సీపీఐ, సీపీఎం నేతలు



బొబ్బిలి: కేంద్రానికి వ్యతిరేకంగా సీపీఐ, సీపీఎం నాయకుల ప్రచారం

రాజాం సిటీ: కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను తిప్పికొట్టాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని సీపీఐ, సీపీఎం నేతలు కె.సురేష్, సీహెచ్ రామ్మూర్తినాయుడు అన్నారు. శుక్రవారం స్థానిక అంబేడ్కర్ జంక్షన్ నుంచి పట్టణంలో కేంద్రానికి వ్యతిరేకంగా ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశ సంపదను ప్రైవేట్ పరం చేస్తూ దేశాన్ని అప్పుల ఊబిలోకి నెట్టేసిన కేంద్రంలోని మోదీ సర్కారుకు ప్రజలంతా తగిన గుణపాఠం చెప్పాలని, లేకపోతే ప్రజాస్వామ్యం పెద్దప్రమాదంలో పడుతుందన్నారు. ఇప్పటికే గ్యాస్, పెట్రోలు, డీజిలు ధరలతో పాటు నిత్యావసర సరుకుల ధరలు కూడా అమాంతం పెంచేస్తున్నారని, ఇది సామాన్యుడికి భారమవుతోందన్నారు. కార్యక్రమంలో ఎన్.నాగభూషణం, కృష్ణ, కనకరాజు, అప్పారావు, విశ్వనాథం, తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

బొబ్బిలి: కేంద్రంలోని బీజేపీ రాక్షస పాలన నుంచి దేశాన్ని కాపాడుకోవాలని సీపీఐ, సీపీఎం నాయకులు పిలుపునిచ్చారు. శుక్రవారం బొబ్బిలి పట్టణంతో పాటు మండలంలోని జగన్నాథపురం, కలువరాయి, కోలిపల్లి, చింతాడ, పక్కి, శివడవలస, పిరిడి, కారాడ గ్రామాల్లో కేంద్రానికి వ్యతిరేకంగా ఆటోతో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా పార్టీల నేతలు కె.అప్పన్న, ఎస్.గోపాలం, ఎ.సురేష్ ప్రధాని మోదీ పాలనపై నిప్పులుచెరిగారు. మోదీవి అన్నీ ప్రజావ్యతిరేక విధానాలేనని విమర్శించారు. నోట్ల రద్దు దగ్గర నుంచి జీఎస్టీ, వ్యవసాయ చట్టాల అమలు, ఇంధన ధరల పెంపు ప్రజాగ్రహం తెప్పించే నిర్ణయాలేనన్నారు. అలాగే హిందూ మతం ముసుగులో దొంగ నాటకాలు ఆడి ప్రజలను మోసగిస్తున్నారని ఆరోపించారు. ప్రజలు ఆలోచన చేయాలన్నారు. వచ్చే ఎన్నికల్లోనైనా బీజేపీ పాలనకు చరమగీతం పాడి, దేశానికి విముక్తి కల్పించాలని కోరారు.

గడప గడపలో 'సంక్షేమ' కాంతులు



ఇంటింటికీ వెళ్లి, సంక్షేమ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే కంబాల జోగులు

- 'గడప గడపకు మన ప్రభుత్వం'లో ఎమ్మెల్యే కంబాల జోగులు

సంతకవిటి: రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలతో ప్రతీ ఇంట సంక్షేమ కాంతులు వెల్లివిరుస్తున్నాయని ఎమ్మెల్యే కంబాల జోగులు అన్నారు. శుక్రవారం మండలంలోని మందాకురిటి గ్రామంలో నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో పాల్గొన్న ఆయనకు గ్రామస్తుల నుంచి ఘనస్వాగతం లభించింది. ఇంటింటికీ వెళ్లిన ఆయన నాలుగేళ్లుగా ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పనులు, అమలు చేస్తున్న పథకాలను వివరించారు. రాష్ట్ర సమగ్రాభివృద్ధి, ప్రజాసంక్షేమమే ధ్యేయంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అహర్నిశలు శ్రమిస్తున్నారన్నారు. అన్ని వర్గాలకు అన్ని రంగాల్లో సమాన ప్రాధాన్యం కల్పిస్తూ అందరివాడిగా గుర్తింపు పొందారన్నారు. అర్హతే ప్రామాణికంగా కుల, మత, రాజకీయ పార్టీలకు అతీతంగా పథకాలు అందజేస్తున్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా పాలనలో సంస్కరణలు తీసుకువస్తున్నారన్నారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ఆయన ప్రవేశపెట్టిన సచివాలయ వ్యవస్థల ద్వారా ప్రజాసమస్యలు పరిష్కారమవుతుండడంతో పాటు ప్రజల వద్దకే ప్రభుత్వ సేవలు వచ్చాయన్నారు. గతంలో టీడీపీ హయాంలో ఏ ఒక్క పథకం కావాలన్నా, అభివృద్ధి పని జరగాలన్నా కేంద్రంలోని ప్రభుత్వ కార్యాలయాలు, అధికారులు, నేతల కాళ్లచుట్టూ తిరగాల్సిన దుస్థితి ఉండేదన్నారు. ప్రజలకు ప్రభుత్వం చేస్తున్న మంచిని చూసి ఓర్వలేని ప్రతిపక్షాలు, ఎల్లోమీడియా లేనిపోని ఆరోపణలు చేస్తున్నాయని విమర్శించారు. గతంలోని టీడీపీ పాలనకు, ఇప్పటి వైఎస్సార్ సీపీ పాలనకు ఉన్న స్పష్టమైన తేడాను గమనించాలన్నారు. వచ్చే ఎన్నికల్లో ఇదే ప్రభుత్వాన్ని ఆశీర్వదించి, సీఎం జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిని చేయాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ ఎస్.జగన్‌మోహనరావు, మాజీ వైస్ ఎంపీపీ జి.కేసరి, సర్పంచ్ బి.జ్యోతీశ్వరరావు, జేసీఎస్ కన్వీనర్ ఆర్.రమేష్‌నాయుడు, ఎంపీటీసీ బి.కుమారి, చిత్తారిపురం సర్పంచ్ ఎం.మోహన్‌రావు, మోదుగులపేట సర్పంచ్ ఆర్.స్వామినాయుడు, ఎంపీడీఓ ఎస్.రఘునాధాచారి, ఎంఈఓ బి.శాంతికుమారి తదితరులు పాల్గొన్నారు.

ఎస్పీ అభినందనలు



రాజాం సిటీ: హెచ్‌సీ సుగుణాకరరావుకు ప్రశంసాపత్రం అందజేస్తున్న ఎస్పీ దీపికా పాటిల్



రామభద్రపురం: ఎస్ఐ సురేంద్రనాయుడుకు ప్రశంసాపత్రం అందజేస్తున్న ఎస్పీ దీపికా పాటిల్

రాజాం సిటీ: జనాలను ఏమార్చి, వరుస దొంగతనాలకు పాల్పడుతూ నగదు కాజేసిన దుండగులను చాకచక్యంగా పట్టుకుని, వారి నుంచి నగదు రికవరీ చేసిన రాజాం పోలీసులను ఎస్పీ ఎం.దీపికా పాటిల్ శుక్రవారం అభినందించారు. ఇదే విషయమై సీఐ కె.రవికుమార్ మాట్లాడుతూ సంతకవిటి మండలం, చిన్నయ్యపేటకు చెందిన ఆర్.జనార్దనరావు మార్చి 1వ తేదీన రాజాం స్టేట్‌బ్యాంక్‌లో విత్‌డ్రా చేసిన రూ.2 లక్షలను తన బండి డిక్కీలో ఉంచి, తాళం వేసి షాపింగ్‌కు వెళ్లాడు. షాపింగ్ అనంతరం వచ్చి బండి డిక్కీలో ఉంచిన నగదు కనిపించకపోవడంతో ఆందోళన చెంది, రాజాం పోలీసులను ఆశ్రయించాడు. దీనిని సవాలుగా తీసుకున్న రాజాం క్రైమ్ హెచ్‌సీ ఎస్.సుగుణాకరరావు, కానిస్టేబుళ్లు సత్యంనాయుడు, శ్రీరాములు, శ్రీను, రాజేంద్రలు సీసీ ఫుటేజీలను పరిశీలించారు. కొత్తవలస స్టేషన్ పరిధిలో ఇదే తరహాలో రూ.5 లక్షలు దొంగలించిన వారు రాజాంలో దొంగిలించిన వారు ఒక్కరే అని గుర్తించారు. స్థానిక మోర్ ఎదురుగా ఉన్న షాపులో పుటేజీ ఆధారంగా దొంగలు చిత్తూరు జిల్లా, నగిరిలో ఉన్నట్లు తెలుసుకుని, అక్కడికి వెళ్లి, వారిని అరెస్ట్ చేశారు. అనంతరం వారి నుంచి రికవరీ చేసిన నగదును బాధితునికి అప్పగించారు. ఈ మేరకు రాజాం క్రైమ్ సిబ్బందిని ఎస్పీ అభినందించడంతో పాటు ప్రశంసాపత్రాలు అందించారని సీఐ తెలిపారు.

రామభద్రపురం: మండలంలోని ఆరికతోట వద్ద మార్చి నెలలో జరిగిన ఓ హత్యాప్రయత్నాన్ని రోడ్డు ప్రమాదంగా మలిచేందుకు ప్రయత్నించిన కేసులో నిందితుడిని ఎస్ఐ సురేంద్రనాయుడును పట్టుకుని అరెస్ట్ చేశారు. ఈ మేరకు ఆయనను ఎస్పీ దీపికా పాటిల్ విజయనగరంలో శుక్రవారం అభినందించి, ప్రశంసాపత్రం అందజేశారు.

మున్సిపల్ కౌన్సిల్ అత్యవసర సమావేశం

బొబ్బిలి: మండల కేంద్రంలో మున్సిపల్ చైర్మన్ ఎస్వీ మురళీకృష్ణారావు అధ్యక్షతన మున్సిపల్ కౌన్సిల్ అత్యవసర సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మార్కెట్ ఆశీలు వేలంపాట టెండర్ ధర తగ్గించేందుకు సభ్యులు ఆమోదం తెలిపారు. పాటదారులను ఆకర్షించేందుకు టెండర్ ధరలో 10 నుంచి 20 శాతం తగ్గిస్తున్నట్లు సభ్యులు పేర్కొన్నారు. అలాగే జగనన్న కాలనీల్లో తాగునీటి సౌకర్యం కల్పించాలని కౌన్సిలర్ శ్రీలక్ష్మి కోరగా, జగనన్న కాలనీలో 22 బోర్ల ద్వారా నీటిని అందిస్తున్నామని, మరమ్మతులైతే వెంటనే బాగు చేసేలా చర్యలు తీసుకుంటున్నామని మున్సిపల్ కమిషనర్ ఎస్.శ్రీనివాసరావు తెలిపారు. దాడితల్లి ఆలయం నుంచి పూల్‌భాగ్ వరకు రోడ్డు మరమ్మతులకు రాజీవ్ నగరబాట కార్యక్రమంలో రూ.7 కోట్లకు కొత్తగా ప్రతిపాదనలు చేస్తున్నట్లు కమిషనర్ తెలిపారు. అనంతరం మున్సిపల్ హెడ్ వాటర్ వర్క్స్ అవకతవక ఆరోపణలపై కమిటీ ఏం తేల్చిందోనన్న విషయాన్ని చైర్మన్ ఆదేశాల మేరకు ఏఈ సురేష్ నివేదిక చదివి వినిపించారు.

సక్రమంగా 'వైఎస్సార్ సంపూర్ణ పోషణ' అమలు

రాజాం: అన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకం సక్రమంగా అమలు చేయాలని ఐసీడీఎస్ రాజాం పీఓ తోట కనకదుర్గ సూచించారు. స్థానిక మారుతీనగర్‌లోని అంగన్‌వాడీ కేంద్రాన్ని శుక్రవారం సందర్శించిన ఆమె పథకం ద్వారా లబ్ధిదారులకు అందజేస్తున్న పదార్థాలను నేరుగా అందజేయవద్దని, వండిపెట్టి వారికి వడ్డించాలన్నారు.

అలాగే కేంద్రాల ద్వారా అందిస్తున్న సేవలను పోషణ ట్రాకర్, వైఎస్సార్ సంపూర్ణ పోష్, వైఎస్సార్ సంపూర్ణ పోషణ మీల్స్ యాప్‌లలో అప్‌లోడ్ చేయాలన్నారు. అలాగే కేంద్రానికి వచ్చే గర్భిణులు, బాలింతలు, చిన్నారుల వివరాలు కూడా నమోదు చేయాలని కార్యకర్త స్వాతిలక్ష్మికి సూచించారు. కార్యక్రమంలో ఏసీడీపీఓ సిమ్మాలమ్మ తదితరులు పాల్గొన్నారు.

రేగిడి: మండలంలోని చాటాయివలస, అక్కన్నఅగ్రహారం, ఉప్పర్నాయుడువలస అంగన్‌వాడీ కేంద్రాలను ఏసీడీపీఓ శిమ్మాలమ్మ శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె అక్కడి రికార్డులు, లబ్ధిదారులకు అందిస్తున్న పౌష్టికాహారం పరిశీలించి, పలు సూచనలు చేశారు.

ప్రభుత్వ కళాశాలల్లో పిల్లలను చేర్పించండి

బాడంగి: ప్రభుత్వ కళాశాలల్లో పిల్లలను చేర్పించి, ప్రభుత్వ సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపాల్ శంకరరావు కోరారు. కళాశాల సిబ్బంది మూడు గ్రూపులుగా ఏర్పడి, మండలంలోని చుట్టుపక్కల గ్రామాలకు శుక్రవారం వెళ్లి, పదో తరగతి పరీక్షలు రాసిన విద్యార్థులు, వారి తల్లిదండ్రులను కలిసి మోటివేషన్ చేశారు. ప్రభుత్వ విద్యాసంస్థల్లో సరిపడ సిబ్బంది ఉండడంతో పాటు నాణ్యమైన విద్య, లైబ్రరీ, ల్యాబ్ సదుపాయాలుంటాయని వివరించారు.

వంగర: పదో తరగతి పాసైన విద్యార్థును మడ్డువలస ప్రభుత్వ కళాశాలలో చేర్పించాలని ప్రిన్సిపాల్ కొరటాన నారాయణరావు కోరారు. మండల పరిధిలోని మగ్గూరు, అరసాడ, నీలయ్యవలస, బాగెంపేట గ్రామాల్లో శుక్రవారం పర్యటించిన ఆయన ఈ ఏడాది పదో తరగతి పరీక్షలు రాసిన విద్యార్థులు, వారి తల్లిదండ్రులను కలిసి, పిల్లలను ప్రభుత్వ కళాశాలలో చేర్పించాలని కోరారు.

జగనన్నతోనే సంక్షేమ పాలన సాధ్యం

- డిప్యూటీ సీఎం రాజన్నదొర



లబ్ధిదారులకు పథకాల మంజూరుపై ఆరా తీస్తున్న మంత్రి రాజన్నదొర

మెంటాడ: రాష్ట్రంలో సంక్షేమ పాలన ఒక్క సీఎం జగన్‌మోహన్‌రెడ్డితోనే సాధ్యమని డిప్యూటీ సీఎం, గిరిజన సంక్షేమ శాఖమంత్రి పీడిక రాజన్నదొర అన్నారు. లోతుగెడ్డ గ్రామ సచివాలయం పరిధిలోని తోటవలస, కొండపర్తి, కొండపర్తిబాడవ, సారాడవలస, జీరికవలస, కొండ ఇప్పలవలస, బాసలపాడు, ఎర్రవానివలస, పుల్లేడవలస, గైరమ్మపేట గ్రామాల్లో శుక్రవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి జగన్‌మోన్‌రెడ్డి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పాలనను వివరించారు. సమస్యలు తెలుసుకున్నారు. పరిష్కరించాలని అధికారులకు సూచించారు. అనంతరం స్థానిక విలేరులతో మాట్లాడారు. రాష్ట్రంలో దేశం మెచ్చే పాలన సాగుతోందన్నారు. అర్హతే కొలమానంగా సంక్షేమ పథకాలను అమలుచేస్తున్న ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. పైసా అవినీతిలేకుండా పథకాల లబ్ధిని నేరుగా లబ్ధిదారుల ఖాతాలకే జమచేస్తున్నారన్నారు. ఫ్యామిలీడాక్టర్ విధానంతో ప్రజలకు ఆరోగ్య భరోసా కల్పిస్తున్నారని చెప్పారు. వచ్చే ఎన్నికల్లో జగనన్న ఓటుతో ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ సారా భీమారావు, వైస్ సర్పంచ్ ఎస్.పి.నాయుడు, ఎంపీపీ ఆర్.ఎస్.నాయుడు, వైస్ ఎంపీపీలు ఎస్ఈ రావు, పి.దుర్గ, మండలస్థాయి నాయకులు ఎల్.ఆర్.నాయుడు, ఆర్.రాజప్పలనాయుడు, ఎంపీడీఓ త్రివిక్రమ్, తహసీల్దార్ ఆదిబాబు తదితరులు పాల్గొన్నారు. లోతుగెడ్డ గ్రామంలో శనివారం గడపగడపకు కార్యక్రమం నిర్వహిస్తామని ఎంపీడీఓ తివిక్రమ్ తెలిపారు.